పరిహారం... పరిహాసం

- అకాల వర్షాలతో 141.63 ఎకరాల్లో ఉద్యాన పంటలు నేలమట్టం
- సుమారు రూ.20 లక్షలకు పైగా రైతులకు నష్టం
- ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం



కుర్లగుండలో ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

వ్యవసాయ డివిజన్లో పంట నష్టం ఇలా...			
మండలం	అరటి (ఎకరాలు)	బొప్పాయి (ఎకరాలు)	బీర (ఎకరాలు)
కళ్యాణదుర్గం	47.35	4.5	1
బ్రహ్మసముద్రం	8.77	2.2	-
కంబదూరు	6.62	7.25	-
శెట్టూరు	12.75	1.62	2.50
బెళుగుప్ప	47.07	1	-
మొత్తం	122.56	15.57	3.50

కళ్యాణదుర్గం: ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికందే సమయంలో గాలీవాన రూపంలో అన్నదాతకు కన్నీళ్లు తెప్పించాయి. పగలు ఉక్కపోత...రాత్రి అకాల వర్షం, ఈదురు గాలులకు ఉద్యాన పంటలు నేలవాలాయి. పంటలు నష్టపోయి ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి రైతులకు అందించే పరిహారం... పరిహాసంగా మారింది. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పరిహారం అందించడంలో విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు.

ఉద్యాన పంటలు నేలమట్టం..

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్లోని కళ్యాణదుర్గం, కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రంతో పాటు ఉరవకొండ నియోజకవర్గం బెళుగుప్ప మండలంలో రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి, బీర పంటలు మొత్తం 141.63 ఎకరాల్లో పంట నేలమట్టమైంది. దీంతో సుమారు ఆయా ప్రాంతాల్లో సుమారు రూ.20 లక్షలకు పైగా పంట నష్టం జరిగినట్లు అంచనా.

క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులు..

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సిన ఆయా గ్రామాల ఉద్యానశాఖ అసిస్టెంట్లు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. పంట నష్టపోయిందని సమాచారం ఇస్తే ఉచిత సలహాలు ఇస్తూ.. కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడంపై రైతులు మండిపడుతున్నారు.

ఆర్ఎస్కే సిబ్బంది పట్టించుకోలేదు



నాకున్న రెండు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశా. పంట చేతికొచ్చింది. ఇటీవల అకాల వర్షానికి, ఈదురు గాలులకు పంట మొత్తం నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నేలవాలడంతో కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పంట నష్టంపై ఆర్ఎస్కే సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. – అనిల్, రైతు, కుర్లగుండ

రూ.1.80 లక్షలు నష్టం



మాకు ఉన్న 3 ఎకరాల్లో అరటి పంట సాగు చేశాం. పంట చేతికొచ్చింది. పంట పెట్టుబడికి సుమారుగా రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టా. ఇటీవల కురిసిన వాన, గాలికి పొలంలో 700కు పైగా అరటి చెట్లు పడిపోయినాయి. మంచి గెల వచ్చిన టైంలో కిందపడటంతో రూ.1.80 లక్షల వరకు నష్టం వచ్చేలా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి. – కమలమ్మ, మహిళా రైతు, మల్లాపురం

నివేదికలు పంపాం

ఇటీవల అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాం. ఐదు మండలాల్లో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించేందుకు ఉద్యానశాఖ ఉన్నతాధికారులకు నివేదించాం. రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తాం. ప్రభుత్వం నుండి పరిహారం అందితే నేరుగా రైతుల ఖాతాలకే జమ అవుతుంది. – కృష్ణతేజ, ఉద్యాన శాఖ అధికారి, కళ్యాణదుర్గం

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న వైఎస్ఆర్సీపీ లీగల్ సెల్ సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని వైఎస్సార్సీపీ నాయకులు విమర్శించారు. గురువారం గురువారం పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో కళ్యాణదుర్గం పార్టీ లీగల్ సెల్ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా లీగల్ సెల్ సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. ఏమి అభివృద్ధి చేశారని ఉరవకొండ నియోజవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో జూనియర్ లాయర్లకు నెలకు రూ. 5వేలు స్టైఫండ్ ఇచ్చేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జూనియర్ లాయర్లకు రూ.10 వేలు అందజేస్తామన్న చంద్రబాబు.. అధికారం చేపట్టాక పట్టించుకోలేదని మండిపడ్డారు. శుక్రవారం ఉరవకొండ నియోజవర్గ పర్యటనకు విచ్చేసే చంద్రబాబుకు రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలపై వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శులు దాదా ఖలందర్, ఎర్రిస్వామి, తాలూకా లీగల్ సెల్ కన్వీనర్ రామాంజనేయులు, రవి, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే ఛాయాపురం అభివృద్ధి



ఛాయాపురంలో మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు

వజ్రకరూరు: వైఎస్సార్ హయాంలోనే ఛాయాపురం అభివృద్ధి జరిగిందని వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని ఛాయాపురంలో వైఎస్సార్సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు దరూరు రమేష్, దరూరు నరసింహులు, వాల్మీకి రామక్రిష్ణ, బాలస్వామి, దూదేకుల మస్తాన్ తదితరులు మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి పాలనలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య ప్రత్యేక చొరవ తీసుకొని సీసీ రోడ్లు, మంచి నీటి ట్యాంకుల ఏర్పాటుకు నిధులు తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామంలో ఇంటింటికీ మంచి నీటి కొళాయిలు కూడా మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య ఏర్పాటు చేయించారన్నారు. వైఎస్సార్ హయాంలో హంద్రీ నీవా సుజల స్రవంతి పథకానికి వేల కోట్లు నిధులు కేటాయించి, పనులు పూర్తి చేయడంతోనే నేడు కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. కృష్ణా జలాలు రావడం వల్లనే ఛాయాపురంలో రైతులు పంటలు పండించుకొని సంతోషంగా ఉన్నార న్నారు. తులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందించారన్నారు. ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరి గాయని, ఎకరా రూ.15 నుంచి రూ. 20 లక్షలు పలు కుతోందన్నారు. ఛాయాపురంలో కాంగ్రెస్ పాలనలో, ఆతర్వాత వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. గత టీడీపీ పాలనలో ఛాయాపురం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిన దాఖలాలు లేవన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



బెళుగుప్పలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర స్వామి ఆశ్రమంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మంగారి మఠం వద్ద రథోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతులు ఈశ్వర స్వామి రథానికి తొలిపూజలు చేసి, రథం వద్ద శాంతి హోమాలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఏకవార రుద్రాభిషేకం నిర్వహించి, రథంలో ప్రత్యేక పూల అలంకరణల మధ్య కొలువుదీర్చి భక్త జన సందోహం మధ్య రథోత్సవాన్ని ముందుకు సాగించారు.

వజ్రకరూరు: గూళ్యపాళ్యంలో గురువారం సాయంత్రం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటం ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయంలో ఆరాధన ఉత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి, తీర్థప్ర సాద వినియోగం నిర్వహించారు.

మట్టి పరీక్షతో పోషకాల స్థాయి గుర్తింపు

- జిల్లా మట్టి పరీక్షా కేంద్రం టెక్నికల్ ఏఓ శ్రీనాథ్ రెడ్డి



మట్టి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మట్టి పరీక్షా కేంద్రం టెక్నికల్ ఏఓ శ్రీనాథ్రెడ్డి

కూడేరు: మట్టి పరీక్ష చేయడం ద్వారా నేలలో పంటలకు అవసరమయ్యే పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో గుర్తించొచ్చని జిల్లా మట్టి పరీక్షా కేంద్రం టెక్నికల్ వ్యవసాయాధికారి శ్రీనాథ్రెడ్డి తెలిపారు. గురువారం కూడేరులోని రైతు సేవా కేంద్రంలో రైతులకు 'మట్టి పరీక్షలు ఏవిధంగా చేయించాలి – దాని వల్ల కలిగే ప్రయోజనాల'పై అవగాహన కల్పించారు. శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లకోసారి ప్రతి రైతూ మట్టి పరీక్ష చేయించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. సరైన పోషకాలు అంది దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం గతేడాది మట్టి పరీక్షలు చేయించుకున్న రైతులకు పరీక్ష ఫలితాల కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏఓ విజయకుమార్, ఏఈఓ శైలజ, వీఏఏ రాజ్కుమార్, వీహెచ్ఏ సాధియా , రైతులు పాల్గొన్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్కు చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు పెద్ద లింగారెడ్డి కుమారుడు గంగాధర, సింధూర వివాహ వేడుకలో వైఎస్సార్సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. గురువారం ఉదయం జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటాక్షిపతిరెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, యర్రగుంట కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని ఉప్పొంక, కర్ణాటకలోని నింగనపల్లి, కంబదూరు మండలంలోని ఓబుగానిపల్లి, గ్రామాల్లో జరిగిన శుభకార్యాల్లో కళ్యాణదుర్గం వైఎస్సార్సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, రాష్ట్ర బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, హనుమంతురాయుడు, జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడు బొమ్మయ్య, తాలూకా యూత్ అధ్యక్షుడు చరణ్, ఎంపీటీసీ భాస్కర్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్, బోయ గణేష్, ఈశ్వర్, ప్రకాష్, శీన, గంగాధర్ పాల్గొన్నారు.

బాబూ గొంతెండున్న పట్టించుకోరా?

- సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు సార్లు జిల్లా పర్యటనకు వచ్చారు.. కనీసం సూపర్సిక్స్లోని మూడు హామీలైనా నెరవేర్చారా? అంటూ వైఎస్సార్సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం తన నివాసం వద్ద మెట్టు మాట్లాడారు. జిల్లాలోని అతిపెద్ద తాగునీటి పథకంగా పిలవబడే శ్రీరామరెడ్డి నీటిపథకం అటకెక్కించారని మండిపడ్డారు. కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించక పోవడంతో 32 రోజులుగా వందలాది గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. ప్రజల బాగోగులు పట్టించుకోవాలన్నారు. జిల్లాలోని ఉరవకొండ పర్యటనకు వచ్చే సీఎం చంద్రబాబు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పేరుకే వరి కొనుగోలు కేంద్రాలు తెరిచారుగానీ సేకరణ లేదన్నారు. తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పుతున్నా అధికారులు మాత్రం అనేక కొర్రీలు పెట్టి వెనక్కి పంపుతున్నారన్నారు. రబీలో చేతికందిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేలా సీఎం చొరవ చూపాలన్నారు. మున్సిపాల్టీ అభివృద్ధికి హామీ ఇచ్చిన రూ.50 కోట్ల నిధులు సత్వరం విడుదల చేయాలన్నారు. హంద్రీ-నీవా ద్వారా బీటీప్రాజెక్టుకు నీరెప్పుడిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని నిర్ణయిస్తే ముందుగా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. మల్లికార్జున మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుపరుస్తూ ప్రజల ప్రాణాలు రక్షిస్తున్న కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్తతోపాటు 21, 22 తేదీల్లో మున్సిపల్ కార్మికులు సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, కార్యదర్శి రాము, సిద్ద, ఎర్రిస్వామి, ఆదిలక్ష్మీ, వన్నూరమ్మ పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం కోటలో వెలసిన కలియుగ ఆరాధ్యదైవం ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20 వరకు ఉత్సవాలు జరుగుతాయని దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. 10న కలశస్థాపన, రక్షాబంధనం, 11న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 12న సూర్యప్రభ వాహనం, 13న శ్రీవారి శేష వాహనోత్సవం, 14న హనమద్ వాహనం, 15న కల్యాణోత్సవం, గరుడ వాహనోత్సవం, 16న గజేంద్ర వాహనం, 17న ఉదయం మడుగు తేరు, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం, 18న పార్వేటోత్సవం, అశ్వ వాహనం, బాణాసంచా వేడుక, 19న వసంతోత్సవం, మయూర వాహనం, 20న సప్త ప్రాకారోత్సవం, శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఎంపీడీఓగా జిలానీ బాషా

శెట్టూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.జిలానీ బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. పుట్లూరు నుంచి పదోన్నతిపై శెట్టూరు ఎంపీడీఓగా వచ్చారు. ఎంపీడీఓకు ఈఓఆర్డీ రఘురాంరావు, సీనియర్ అసిస్టెంట్ సరిత, ఏఓ శేషారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర కుమార్, టైపిస్ట్ మెర్సీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్డీటీపై ఆంక్షలు విధించొద్దు

బొమ్మనహాళ్: ఆర్డీటీపై ఆంక్షలు విధిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అంబేడ్కర్ సేన జిల్లా యువజన నాయకుడు కేసీ పవన్కుమార్ తెలియజేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సేవ్ ఆర్డీటీ అంటూ నిరసన తెలిపారు. కేసీ పవన్కుమార్ మాట్లాడుతూ ఆర్డీటీకి నిధులు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రామాంజనేయులు, వాల్మీకి సంఘం నాయకుడు దివాకర్, అంబేడ్కర్ సేన నాయకులు రాజశేఖర్, నాగార్జున, అనిల్, కుమార్, రమేష్, సురేష్, విజయ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలన

రాయదుర్గంటౌన్: దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆర్థో స్పెషలిస్టు అభిలాష్ ఆధ్వర్యంలో పరిశీలన జరిగింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు క్యాంపునకు విచ్చేసి పరిశీలన చేయించుకున్నారు. సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు సదరు వైకల్యం ఉన్న వారిని మరోసారి వైద్యుడు క్షుణ్ణంగా పరిశీలించారు. నెలలో రెండు క్యాంపుల చొప్పున ఆరు రోజుల పాటు పునఃపరిశీలన కార్యక్రమం జరుగుతోంది. ఒక రోజుకు 50 సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు.

మజ్జిగ పంపిణీ

ఉరవకొండ: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయచంద్ర, క్లబ్ రీజనల్ చైర్మన్ కొమ్మసాని బాలచంద్ర మాట్లాడుతూ ఎండలతీవ్రత పెరుగుతుండడంతో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

ఆక్సిజన్ ప్లాంట్కు అస్వస్థత



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్

రాయదుర్గంటౌన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఊపిరి పోసి ఎంతో మంది రోగుల ప్రాణాలు నిలిపిన ఆక్సిజన్ ప్లాంట్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రోగుల కోసం రూ.లక్షలు వెచ్చించి సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో చాలా మంది రోగులకు ఆక్సిజన్ ప్లాంట్లు ఉపయోగపడి ప్రాణాలతో బయటపడ్డారు. కానీ రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిలో ప్లాంట్ ఏర్పాటు చేసి, దాదాపు 40కిపైగా బెడ్లతో పాటు ఆపరేషన్ థియేటర్కు సైతం ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ప్లాంట్ను వైద్యాధికారులు వినియోగంలోకి తీసుకురావడంలేదు. కరోనా సమయంలో దాత ప్రవీణ్కుమార్రెడ్డి అందించిన మరో ఆక్సిజన్ ప్లాంట్ కూడా నిరుపయోగంగా ఉంది.ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యాధికారిగా మస్రత్ జహా

విడపనకల్లు: విడపనకల్లు పీహెచ్సీ డాక్టర్గా మస్రత్జహా (కొత్త సాక్షి) గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉరవకొండ సీహెచ్సీ వైద్యాధికారిగా ఈమె రెండున్నరేళ్ల పాటు పనిచేసి బదిలీపై విడపనకల్లు పీహెచ్సీకి వచ్చారు. అనంతరం డాక్టర్ మస్రత్జహా మాట్లాడుతూ పీహెచ్సీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తామన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

కూడేరు: చిన్నతనం నుంచే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారిణి రాధారాణి విద్యార్థులకు సూచించారు. గురువారం సమ్మర్ క్యాంపులో భాగంగా కూడేరు గ్రంథాలయంలో విద్యార్థులకు 'మంచి అలవాట్లు – ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం' అనే అంశాలపై గ్రంథాలయాధికారిణి రాధారాణి అవగాహన కల్పించారు. సిబ్బంది ఆరుద్య గౌడ్, వసంత, పిల్లల తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

రాయదుర్గంటౌన్: పట్టణంలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను మున్సిపల్ అధికారులు గురువారం పరిశీలించారు. కమిషనర్ దివాకర్రెడ్డితో పాటు డీఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ నరసింహులు, శానిటరీ ఇన్స్పెక్టర్ రవీంద్ర యాదవ్ క్షేత్రస్థాయిలో పూడికతీతను తనిఖీ చేశారు.

బడుగులకు అండగా పోరాటం

రాయదుర్గంటౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు అన్ని వర్గాలకు బహుజన సమాజ్ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణ చంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్కుమార్, రాయలసీమ ఇన్చార్జ్ , చిందనూరు నాగరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బళ్లారి రోడ్డు శివారులో ఉన్న నేషనల్ ఫంక్షన్ హాల్లో బహుజన సంకల్ప సభ నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాసాని నాగరాజు, రాయదుర్గం ఇన్చార్జ్ కృష్ణ, జయచంద్ర పాల్గొన్నారు.

మహిళలకు తీవ్ర గాయాలు

కూడేరు: గొట్కూరుకు చెందిన గోవిందరెడ్డి భార్య సంధ్య పొలం పనులు చేస్తుండగా ప్రమాదానికి గురయ్యింది. ఉదయం పొలంలో దానిమ్మ చెట్లకు తెగుళ్ల నివారణ మందు యంత్రంతో పిచికారీ చేస్తుండగా, సంధ్య డ్రమ్ములో మందు ఎంత ఉందో చూసే క్రమంలో ఆమె జడ యంత్రం చక్రంలో పడి, ముందుకు లాక్కుంది. వెంటనే భర్త యంత్రాన్ని ఆపేశాడు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. ఆమెను అనంతపురం ఆస్పత్రికి, అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ దుర్మరణం

కళ్యాణదుర్గం రూరల్: కోటవీధిలో ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు..పట్టణానికి చెందిన రామాంజనేయులు (40) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం రామాంజనేయులు ట్రాక్టర్ నడుపుతూ వెళ్తుండగా ప్రమాశాత్తూ డ్రైవింగ్ సీట్లో నుంచి కిందపడ్డాడు. అతనిపై ట్రాక్టర్ వెళ్లింది. ఈ ప్రమాదంలో రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్థానిక సీహెచ్సీకి తరలించారు. చికిత్స పొందుతూ రామాంజనేయులు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐచర్ వాహనం బోల్తా

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కామక్కపల్లి గ్రామం వద్ద బుధవారం అర్ధరాత్రి ఐచర్ వాహనం బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నీలకంఠ తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల ఆకలి కేకలు పట్టవా?

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల ఆకలి కేకలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మండిపడ్డారు. బకాయి వేతనాలు చెల్లించాలంటూ 34 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాధాకరమని అన్నారు.గురువారం కళ్యాణదుర్గంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలి

ఉరవకొండ: హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా మొదటి దశ కింద మిగిలిన డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి చాటుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.మధుసూదన్రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్ బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డి మానస పుత్రిక హంద్రీ నీవాను ప్రారంభించి మొదటి దశ కింద 90 శాతం పనులు పూర్తి చేశారన్నారు. దక్కిన 10 శాతం పనులు పూర్తి చేయడానికి చంద్రబాబు సీఎం అయిన తర్వాత 2014లో డిస్ట్రిబ్యూటరీ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు కాలరాస్తున్న కూటమి

- సర్కారు తీరును ఖండించిన పాత్రికేయులు, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు



కళ్యాణదుర్గంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు, ప్రజా సఘాల నాయకులు

రాయదుర్గం: ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియాపైనా చంద్రబాబు సర్కార్ రెడ్బుక్ రాజ్యాంగంతో వేధింపులకు పాల్పడడం సరికాదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, వైఎస్సార్సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివ, పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, రామాంజనేయులు, దొమ్మర సంఘం అధ్యక్షుడు రామకృష్ణ ఖండించారు. గురువారం ఉదయం సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలోకి అనుమతి లేకుండా పోలీసులు వెళ్లి సోదారులు నిర్వహించడాన్ని వారు తప్పుపట్టారు. ఈ సందర్భంగా పాత్రికేయులు నిర్వహించిన ఆందోళనకు ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతు పలికాయి. రాయదుర్గం సాక్షి ఇన్చార్జ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. కూటమి సర్కార్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛకోసం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ఎమర్జెన్సీ రోజుల నాటి అరాచకాలకు కూటమి సర్కార్ తెర తీస్తోందన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి లక్ష్యంగా చంద్రబాబు సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇటీవల అక్రమ కేసులు నమోదు చేసిన పోలీసులు.. నేడు ఏకంగా ఇంట్లోకి చొరబడి నానా హంగామా సృష్టించడం ఫోర్త్ ఎస్టేట్కే అవ మాన కరమన్నారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటన్నారు. అనంతరం ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలతో కలసి సాక్షి బృందం రాధాకృష్ణ, సలామ్, బాబా సాహెబ్, వంశీ కృష్ణారెడ్డి, గోవిందరాజులు తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఎడిటర్ నివాసంలోకి అక్రమంగా చొరబాటు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పొరాళ్ల గోవింద రాజులు, వార్డు ఇన్చార్జులు నిజామ్, బషీర్, రామాంజినేయు లు, రాము, కోఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, ప్రశాంత్ యాదవ్, ఖాజ, చదం సర్పంచ్ వెంకటే శు లు, నాయకులు మహేష్, సురేష్, ఉల్లిగప్ప, హరిశ్చంద్రనాయక్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే

కళ్యాణదుర్గం: సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలోకి అనుమతి లేకుండా చొరబడి సోదాలు చేయడం హేయమైన చర్య అని పాత్రికేయులు, ప్రజా సంఘాలు మండిపడ్డాయి. గురువారం కళ్యాణదుర్గం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యులు పూజారి మల్లికార్జున, సాక్షి ఆర్సీ ఇన్చార్జ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి, ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ పోలీసులు వ్యహరించిన తీరు సరికాదన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఎలాంటి వారెంట్లు జారీ చేయకుండానే దాడులు చేయడం కక్ష పూరిత చర్య అని మండిపడ్డారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేసినందుకు కక్ష పూరితంగా పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోందని తెలియజేశారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ పాత్రికేయుల హక్కులను కాలరాసేలా పోలీసులు వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి ఈశ్వరమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాత్రికేయులు నందీష్, లక్ష్మన్న, సుమన్ టీవీ శివకుమార్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప తదితరులు పాల్గొన్నారు.